

# అద్భుతమైన చీర

మల్లాది వెంకట కృష్ణమూర్తి

విద్యావతిని సాదరంగా ఆహ్వానించి పలకరించాడు బట్టలదుకాణం యజమాని

"కులాసానా అమ్మా? మా మీద సీతకన్ను వేసారు బొత్తిగా"

"కులాసా ఎలావుంది మీ వ్యాపారం




కొత్తచీరలేమైనా వచ్చాయా ?" చిరునవ్వుతో అన్నది, విద్యావతి ఎదురుగా కౌంటర్ మీదవున్న ఓ సినిమాపత్రికని అప్రయత్నంగా అందుకొంటూ.

బట్టలదుకాణం యజమాని కుర్రాడిని కోకాకోలా పట్టుకురమ్మని పంపించాడు. విద్యావతికి గాలి చక్కగా తగిలేలా ఫేన్‌ని ఎడ్జెస్ట్ చేశాడు.

"ఫారిన్‌నైలెక్స్ కొత్తవేమయినా వచ్చాయా ?" అడిగింది విద్యావతి.

"ఉన్నాయి. మాదగ్గర అద్భుతమయిన చీరవుంది. షిఫాన్ అనుకోండి. అది మీలాంటి రెగ్యులర్ కస్టమర్స్‌కే అమ్మాలని దాచివుంచాను."

"షిఫాన్‌లో అద్భుతమయిన చీరలుంటాయని నాకు తెలియదే" అన్నది విద్యావతి పకపకా నవ్వి.

"ఉందవు. కాని మాదగ్గరది మాత్రం నిజంగా అద్భుతమయినదే. ఆ సినిమా పుస్తకం ఇటివ్వండి చెప్తాను" అని అయన ఆ సినిమా మేగ్జైన్ అందుకుని, గబగబా పేజీలు తిప్పి, ఓ హీరోయిన్ బొమ్మని చూపించాడు విద్యావతికి. రంగుల్లోవున్న ఆ బొమ్మలో హీరోయిన్ కట్టుకున్న చీర నెమలికంఠం రంగుచీర-అందంగా వుంది.

"అచ్చం ఇలాంటి చీరే మావద్దవుంది. నిజానికి ఈ చీరే మాదగ్గర వుంది."

"ఈ చీరా?'' ఆశ్చర్యంగా అడిగింది.

"అవును. ఇదే ఇంకా ఈ సినిమా విడుదలవలేదు "

అద్దాల షోకేస్‌లోంచి ఓ చీర తీసి కౌంటర్‌మీద పరిచాడు. విద్యావతి ఆ చీరని బొమ్మలోవున్న చీరతో పోల్చి చూసింది. రెండూ ఒకటే రంగు డిజైన్‌లో వున్నాయి.

"ఈ హీరోయిన్ నా అభిమాన తార. ఈ చీర ఖరీదెంత?" అడిగింది ఆత్రంగా.

ధర చెప్పాడు ఆయన. కుర్రాడు అందించిన కోకాకోలా తాగాక అన్నది విద్యావతి హేండ్‌బేగ్ తెరుస్తూ...

"పేక్ చేయించండి."

నెల తర్వాత ఆ సినిమా విడుదలయింది. విద్యావతి ముందరే భర్తతో చెప్పి ఆ సినిమాకి మొదటిఆటకి రెండు టికెట్స్ రిజర్వ్ చేయించింది. ఆ నెమలి కంఠం రంగు షిఫాన్‌చీర కట్టుకునే వెళ్ళింది సినిమాకి భర్తతో హుందాగా. సినిమా నడుస్తున్నంతసేపూ తను కట్టుకున్న తరహాచీర హీరోయిన్ ఏ ఏ దృశ్యాలలో కట్టుకుందో గమనించి భర్తకు చెప్పసాగింది విద్యావతి. ప్రక్కవాళ్ళుకూడా ఆసక్తిగా వింటున్నారు దృశ్యం మారింది. రేప్‌సీన్ అది. విలన్ హీరోయిన్‌ని రేప్‌చేస్తున్న దృశ్యం అది

తెరమీద, "వద్దు నీచుడా, నన్ను వదిలిపెట్టు" అన్న హీరోయిన్ కేకలతో పాటు, తెరముందు నేల తరగతి ప్రేక్షకుల ఈలలు, అరుపులు, చప్పట్లతో కొద్ది నిముషాలు ఆ సినిమాహాలు ప్రతిధ్వనించింది.

అకస్మాత్తుగా ముందు మూడో వరస లోంచి ఆ బట్టలదుకాణం యజమాని కంఠం ఆ దంపతులిద్దరికీ వినిపించింది. ఎవరితోనో చెప్తున్నాడు ఆయన.

"మనవూళ్ళోనే జరిగింది ఈ దృశ్యం షూటింగ్. ఇప్పుడు హీరోయిన్ కట్టుకున్న లాంటిచీర మద్రాస్‌లో మర్చిపోయారట వచ్చేటప్పుడు. ప్రొడక్షన్ మేనేజర్ మా షాపులోంచి ఇప్పుడు హీరోయిన్ కట్టుకున్న చీరని అద్దెకుతీసుకెళ్ళాడు. తర్వాత ఓ ఖాతాదారుకి ఆ చీరని అమ్మేసామనుకోండి."

తెరమీద ఆ హీరోయిన్ వంటిమీద చీర అప్పటికే ముప్పాతిక భాగం వూడి పోయింది '

